కథ

# పి.వి.శేషారత్నం

# మనసిచ్చినదే నిజమైతే...

నా ముందు టీపాయ్ మీద చెల్లా చెదురుగా పరిచిన దినపత్రికలు. వాటినిండా తాటికాయలంతటి ఎర్రని అక్షరాలతో 'ప్రేమ ఒక ఉన్మాదమా?' అంటూ వార్తలు.

'కాలేజీకెళ్తున్న అమ్మాయిపై ఓ కుర్రాడు రాయితో దాడిచేసి తల పగలగొట్టాడు'

ప్రేమోన్మాది చేతిలోని వేట కొడవలికి కాలేజీ విద్యార్థిని బలి...ఆస్పత్రిలో చావు బ్రతుకుల మధ్య యువతి.

ప్రేమ నిర్వాకంతో అభం శుభం తెలియని బాలికపై అత్యాచారం చేసిన ఉపాధ్యాయుడు.

మాయమాటలు చెప్పి యువతిని గర్భవతిని చేసి యువకుడు పరారీ.

ప్రేమోన్మాదంతో యువతి గొంతు కోసి..తప్పించుకున్న వ్యక్తి కటకటాలపాలు.

ఇదంతా ప్రేమతోనేనా? ఆ పేరుతో ఉన్మాదంలోనా? అమాయక అబలల భవితవ్యపు సుందర స్వప్నాలను ఛిద్రం చేస్తూ..విద్య, మానవతా విలువలను మంట గలుపుతూ..ఉపాధ్యాయులు..ఇంజినీర్లు..ఎందరో యువకులు ప్రేమ పేరుతో యువతుల ప్రాణాలు బలితీసుకోవడం అనాగరికం....మీరు ఎవరినైనా ఇష్టపడితే ఆమె సంతోషాన్ని కోరుకోవాలిగాని ఆమె ప్రాణాలను కాదు. నిజంగా ప్రేమించేవాళ్ళెవరు ప్రేయసి కష్టపడుతుంటే చూడలేరు. ఆమె శరీరాన్ని కోరుకున్న వాళ్లు తప్పితే ఆమె మనసును కోరుకున్న వాళ్లు ఆమె బాధపడుతుంటే చూసి తట్టుకోలేరు.

ప్రపంచంలో అందరూ ఇష్టపడిన వాళ్లనే చేసుకోలేరు. దయచేసి ఇష్టపడిన అమ్మాయిల జీవితాలను నాశనం చెయ్యకండి. వాళ్ల జీవితం వాళ్లిష్టం. వాళ్ల జీవితాలను నిర్దేశించుకునే హక్కు వాళ్లకి లేదా? అలాంటప్పుడు వాళ్ల నిర్ణయాలను వాళ్లకే వదిలేయండి. నిర్ణయం ఎలా ఉన్నా అంగీకరించండి. మీకు ఈ నిర్ణయం నచ్చలేదని ఆమె జీవితాన్ని నాశనం చెయ్యడం వల్ల మీకు ఒరిగేదేమీ లేదు. వీలైతే సాయం చెయ్యండి. దీనివల్ల కలిగే మానసిక సంతృప్తి అనిర్వచనీయమైనది.. సంపాదకీయాలు చదువుతూ ఆరోజు పేర్లు విసిరికొట్టాను చిరాకుగా.

ప్రపంచంలో ఇంకేం వార్తలు లేనట్టు ఈమధ్యకాలంలో రోజూ ఇవే వార్తలు.

అసలు నా దృష్టిలో 'ఈ ప్రపంచం మిథ్య కాదు. సత్యము..నిత్యము..ఇక ప్రేమ, దోమ, త్యాగం..ఇవన్నీ బ్రతకడం చేతగాని పిరికివాళ్లు పట్టుకుని వేలాడే పిచ్చి పదాలు. ఇదంతా మెటీరియలిస్టిక్ వరల్డ్. అందులో ఎన్నో వేల జీవాలున్నాయి. సృష్టికోసం పురుషజీవాన్ని స్త్రీ జీవం ఆకర్షించడం సహజం. ఉన్న ఆయుఃప్రమాణం నూరేళ్లలో ముప్పాతిక భాగం ఏడుపులు, పెడబొబ్బలు..మానసిక ఆందోళనలతో జీవిత మాధుర్యాన్ని చేదు చేసుకుంటారు. నా శ్రీమతి మంగళా అంతే. నాలాంటి కోటీశ్వరుడి భార్య అయి ఉండీ ఎప్పుడూ ఏదో అసంతృప్తితో దిగులుతో ఏదో పోగొట్టుకున్నదానిలాగ బాధపడుతూనే ఉండేది. చివరికి మనోవ్యథతోనే కాలం చేసింది.

నా కూతురు సుధ నా జీన్స్‌ను కాస్త ఎక్కువగానే పుణికిపుచ్చుకున్నట్టుంది. ఎప్పుడూ గలగల నవ్వుతూ తుళ్లుతూ జీవితాన్ని వ్యాపారంలాగా లాభనష్టాల బేరీజుతో నడిపిస్తూ, ఏడాది క్రితం కులం, అందం, ఆస్తి, హోదా అన్నీ ఉన్న కుర్రాడిని వెతుక్కుని మరీ ప్రేమించింది. అభ్యంతరం పెట్టడానికి నాకు అవసరమేం కనిపించలేదు. ప్రేమ అనే ధోరణిలో వెళ్లిన మార్గం కనుక నా చేతి చమురు కూడా పెద్దగా వదల్లేదు.

"డాడీ..మీతో కొంచెం మాట్లాడాలి"

నేను విసిరేసిన పేపర్లు తీసి టీపాయ్ మీద పొందికగా సర్దుతూ..పాతికేళ్ల నా కొడుకు సూరజ్ నా ఎదుట చేతులు కట్టుకుని నిలబడ్డాడు. వాడికి పెట్టిన పేరులాగే సూర్యుడిమలాగా వాడి జీవితమంతా వెలిగిపోవాలని..వాడు ఈ ప్రపంచంలో ఆనందాన్నంతా అనుభవించాలని వాడి ముఖం సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే అప్పుడు వాడి జీవితం ఒక గాడిలో పడేందుకు పెళ్లి చెయ్యాలనీ అనుకున్నాను. లేకపోతే ఐదేళ్ల నుండీ ఆడదిక్కులేని ఈ యింటికి కోడలి అవసరం చాలానే వుంది.

కానీ ఈ లోకంలో మగాడయి పుట్టి కూడా నా కొడుకు ఓ ఏబ్రాసిలాగా నా ముందు అలా నించుంటే నాకు చిరాకేసింది. వాడికి నా పోలికలెక్కువ రాలేదు. అందుకే సెంటిమెంట్లతో ఈ గోల. ఏదో ప్రేమ వ్యవహారంలో ఇరుక్కుని ఉంటాడు.

"మన కులమేనా?" సూటిగా వ్యవహారంలోకి దిగుతూ అడిగాను.

"తెలియదు" అంత వాజెమ్మ జవాబు వస్తుందనుకోలేదు. సరే కుర్రాడు కదా కాస్త అభ్యుదయ భావాలే డిసి ఉంటాయనుకుని సర్ది చెప్పుకున్నాను.

"ఆస్తిపాస్తులేమయినా ఉన్నాయా?"

"లేవు" మధ్యతరగతి పిల్లేమో...

"ఇంతకీ ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోకపోతే ఉండలేనంటావు. అంతేనా?" తనమీద ఎగిరి పడతాననుకున్న నేను అంత సింపుల్‌గా తేల్చి పారేస్తుంటే ఈసారి విస్తుపోవడం మావాడి వంతు అయింది.

"అదికాదు. నేను శ్రీలతను పెళ్లి చేసుకోదల్చుకున్నాను. కొడుకుగా మీకు చెప్పడం నా కనీస ధర్మమనుకున్నాను"

ఛ..ధర్మం..కర్తవ్యం..వీడీ జన్మకి బాగుపడడు.

"ఆస్తిపాస్తుల్లేని పిల్లని చేసుకునే ఖర్మ నీకేంటిరా నాన్నా..ఈ ప్రేమా దోమా అంటా ట్రాష్. నాలుగు రోజులు నువ్వు కనిపించకపోతే ఆ అమ్మాయి మర్చిపోయి ఇంకొకరిని పెళ్లి చేసుకుంటుంది. జడ్జిగారమ్మాయి నీకన్ని విధాలా సరిపోతుంది. నువ్వెళ్లి ఆ పిల్ల వ్యవహారం ఏదో కాస్త డబ్బు పారేసి సెటిల్ చేసుకొస్తే..లేను నన్ను బెదిరించి సెటిల్ చెయ్యమంటావా? భయం లేదు చెప్పు" ఇవే మాటలు నా తండ్రి చాలా యేళ్ల క్రితం నాతో అన్నట్టు గుర్తు.


"ఆగండి..నేనడుగుతున్నది నాకు ఎవరితోనో పెళ్లి చెయ్యమని కాదు. నాకిష్టమైన వ్యక్తిని నేను పెళ్లి చేసుకోబోతున్నాను. ఆ పెళ్ళికి వచ్చి ఆశీర్వదించమని" నా అహంభావం దెబ్బతింది...వాడు నాతో దెబ్బలాడడం లేదు. సాత్వికంగా అతి సహజంగా మాట్లాడుతున్నాడు.

"అంతేకాదు మీరనుకుంటున్నట్టు నేను ప్రేమ మోజులో పడి కులం పట్టించుకోకపోవడం కాదు. శ్రీలత గురించి నాకంతా తెలుసు. బ్రతుకు తెరువు కోసం తమ శరీరాన్ని ఫణంగా పెట్టి జీవించే కులంలో పుట్టిన మనిషి, అయినా నా ప్రేమకు ఆమె కులం అడ్డు కాలేదు"

సూరజ్ కంఠంలో ఏమాత్రం ఆవేశం లేదు..కానీ నాకే ఉన్నట్టుండి బి.పి.పెరిగింది. నా రక్తం పంచుకుని పుట్టినవాడు నేను పెంచి పోషించిన శరీరం వాడిది. గుప్పిళ్లు బిగుసుకున్నాయి ఆవేశంతో.

"నువ్వు..నువ్వేం మాట్లాడుతున్నావో ఒళ్లు తెలుస్తోందా? ఒళ్లమ్ముకుని బతికే కులటను పెళ్లాడే అవసరం నీకేంటి? వాళ్ల ప్రేమ అంతా బూటకం. డబ్బు

ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన



కోసం ఆదే నాటకం. అదంతా నిజమనుకుని నువ్వు బుట్టలో పడివుంటావు"

ఆవేశంలో సూరజ్‌కి నచ్చజెప్పాలన్న తాపత్రయంలో నాకు మాట సరిగా పెగలడం లేదు.

"లేదు డాడీ! ఆమె నన్నేం మోసం చెయ్యలేదు. ఆమె విషయమంతా పూసగుచ్చినట్టే చెప్పింది. ఆమెకి వృత్తిలో బ్రతకడం ఇష్టం లేదు"

"అంటే త్యాగం చేస్తున్నావా?"

"ఇందులో త్యాగం ఏముంది? మా మనసులు కలిసాయి. ఆమె గత జీవితంతో నాకు సంబంధం లేదు. ఆమెను ఉద్ధరించాలనీ చేసుకోవడం లేదు. ఆమె అంటే నాకు వల్లమాలిన ఇష్టం. నేనిష్టపడే వ్యక్తికి తోడునీడగా ఉండి ఆమెను అపురూపంగా చూసుకునేందుకే"

"నోర్ముయ్...నువ్వొక వేశ్యను పెళ్లాడ్డానికి వీల్లేదు. నా పరువు ఏం కాను? జడ్జిగారికి నేనిచ్చిన మాట ఏం కావాలి?"

"నేనూ శ్రీలత మాటిచ్చాను"

ఇక లాభం లేదు. ఆఖరి అస్త్రం ఒక్కటే ఉంది. "నువ్వు ఆ కులటను చేసుకుంటే నా ఆస్తిలో చిల్లిగవ్వ కూడా దక్కదు. నేను చచ్చినా నా శవం కూడా నువ్వు ముట్టుకోడానికి వీల్లేదు"

"ఆవేదన పడకండి డాడీ! మీకటువంటి సెంటిమెంట్లు లేవుగా. అయినా నాకు కర్మ సిద్ధాంతం మీద ప్రేమ, త్యాగం మీద చాలా గౌరవముంది. ఆడవాళ్ల దిక్కులేనితనాన్ని అబలత్వాన్ని ఆసరా చేసుకుని వాళ్లకు నేను ద్రోహం చెయ్యలేను. అలా చేసి జీవితాంతం ప్చ్..ఎందుకులెండి అయినా నా శ్రీలత జీవితం మమత ఆంటీలా అవడానికి వీల్లేదు. మీకిష్టమైతే బాలాజీ గుడిలో జరగబోయే రేపటి మా పెళ్లికి వచ్చి ఆశీర్వదించండి" సూరజ్ తాపీగా హుందాగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. నా అహంకారానికి దెబ్బకొొన్ని నా ఆశల సౌధాన్ని కూలదోసి వెళ్లిపోయాడు.

'మమత ఆంటీలా అవడానికి వీల్లేదు..అంటే మమత సూరజ్‌కెలా తెలుసు? అది నా జీవితం అట్టడుగున సమాధి అయిన విషయం. నా భార్యకు కూడా తెలియని నిజం..సరిగ్గా ఇరవయ్యేళ్ల క్రితం..

నా అనేవారు లేకపోయినా ఎలాంటి ఆప్యాయతా దరణలకు నోచుకోకపోయినా జీవితాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకుని దొరికిన జీవితంలోనే మధురిమను చవి చూడాలని ఆశపడే గంగిగోవులాంటి మమత, తన చిన్న ఉద్యోగానికే తృప్తిపడి ఆఫీసులో గలగల సెలయేరులా పారుతూ, లేడిపిల్లలా తుళ్లుతూ నవ్వుతూ

చుట్టూ అందరినీ నవ్విస్తూ నన్నెంత ఆకర్షించింది. ఎంతో ప్రేమించింది.

అప్పట్లో సరదాగా ఉద్యోగం చేస్తూ..జీవితాన్ని తనివితీరా స్వేచ్ఛగా అనుభవించాలని ఉరకలేస్తూ పరవళ్లు తొక్కుతున్న వయసు నాది. చేతినిండా డబ్బు..కంటికి అందంగా ఒద్దికగా ఓర్పుగా బాపుబొమ్మలా కనిపిస్తున్న మమత..నన్ను ప్రేమిస్తూ నాతో పెట్టాపట్టాలేసుకుని తిరగడం..నాకెంతో గర్వంగా ఉండేది. మమత నాది అన్న భావన...ఆ పొజిసివ్‌నెస్ నాకెంతో థ్రిల్ నిచ్చేది. 'లక్షల ఆస్తికి వారసుడివి. ఆస్తిపాస్తుల్లేని పిల్లని చేసుకునే ఖర్మ నీకేంటిరా! ఈ ప్రేమా దోమా అంతా ట్రాష్. నాలుగు రోజులు నువ్వు కనిపించకపోతే ఆ అమ్మాయే మర్చిపోయి ఇంకొకరిని పెళ్లి చేసుకుంటుంది. లాయర్ రాఘవరావుగారమ్మాయి. నీకన్ని విధాలా సరిపోతుంది. నువ్వెళ్లి ఆ పిల్ల వ్యవహారం ఏదో కాస్త డబ్బు పారేసి సెటిల్ చేసుకొస్తే...లేదా నన్ను బెదిరించి సెటిల్ చెయ్యమంటావా? భయం లేదు చెప్పు'

'మమతను నేను పెళ్లి చేసుకుంటాను డాడీ' అన్నప్పుడు మా డాడీ ఇలాగే అన్నారు.

కానీ మమత ఎవరితోనయినా మాట్లాడితేనే సహించలేని నేను మమతను వదులుకుని బతకాలా? నేను చేసుకోకపోతే ఎవరినో చేసుకుని వాడు నా మమతతో సంసారం చేస్తోంటే సహించగలగడమా? నో..ఆవేశంగా మమత దగ్గరికి పరిగెత్తాను. ఆమెనెలాగయినా దక్కించుకోవాలి..నాదానిని చేసుకోవాలి.

"మమతా! మన పెళ్లికి మా డాడీ ఒప్పుకోవడం లేదు. మనం గుళ్లో పెళ్లి చేసేసుకుందాం"

"సారీ నాకిష్టంలేదు" ఊహించని ఆమె జవాబుతో..బాంబు పక్కలో పేలినట్టయింది నాకు.

"అదేంటి? ఎందుకని?"

"అవును. ఈశ్వర్..నిన్ను చేసుకోవడం నాకూ ఇష్టం లేదు"

"కారణం?" నాలో అసహనం..నా గుప్పిళ్లు బిగుసుకుంటున్నాయి.

"మనిద్దరి మనస్తత్వాలు వేరు..మనకి పెళ్లి పొసగదు. నన్ను అర్థం చేసుకో" ఇది నేనూహించనిది.

"అంతా నీ ఇష్టమేనా? పొసగదని ఇప్పుడు తెలిసిందా? ఏం చూసుకుని నీకు పొగరు? ఓహో ఆ రాజాగాడు నిన్ను చేసుకుంటానన్నాడా?"

"హోల్డ్ యువర్ టంగ్..నేనెవరిని చేసుకుంటాననేది మీకనవసరం" ఎక్కువ వాదులాడకుండా మమత వెళ్లిపోయింది.

నా తల కొట్టేసినట్టయింది. పదిమందిలో ఇది నాకెంత అవమానం. అది నన్ను కాదని ఆ రాజాగాడితో పెళ్లి చేసుకుని...వాళ్లిద్దరూ చెట్టాపట్టా లేసుకుని తిరుగుతుంటే నేను కళ్లప్పగించి చచ్చు సన్నాసిలా...నో..అలా జరగడానికి వీల్లేదు.

తర్వాత మళ్లీ మమతను కలిసినా అదే సమాధానం.

అంతే..నాలుగు రోజులు వరుసగా ఆమెను గమనించాను. నా ఊహ నిజమే. నా ప్రాణ స్నేహితుడు రాజాగాడిని కలుస్తోంది. వాళ్ళిద్దరు పార్కులో కూర్చుని గంటలకొద్దీ కబుర్లు..మధ్యమధ్యలో మమత కళ్లు తుడుచుకోవడం..వాడు ఓదార్చడం.

నాకు మనసు రగిలిపోయింది. ఇది నేనూహించనిది. నాకు తెలియకుండా వీళ్లిద్దరూ ఎప్పుడు ఒకటయ్యారు. ఇంతకు ముందు ఎప్పుడు కలుసుకునేవారు. వాడితో ఏ కడుపో కాలో వచ్చి ఉంటుంది. అందుకే ఆ ఏడుపు.

"నువ్వు వాడితో తిరిగి చెడిపోయినా ఫరవాలేదు. నేను చేసుకుంటాను. నువ్వు నీ ఆనందం నాకే సొంతం కావాలి తప్ప ఇంకెవరూ సొంతం చేసుకోవడానికి వీల్లేదు" త్యాగం చేస్తున్నట్టు అన్న నా మాటలకి కృతజ్ఞతతో పొంగిపోతుందనుకున్న మమత చేసిన ఛీత్కారంతో నా ఆవేశం నషాళానికంటింది.



ఆ తర్వాత వరుసగా అనుకోని సంఘటనలు..ఆఫీసునుంచి ఒంటరిగా ఇంటికి వెళ్తున్న మమత దారి కాచి..ఎవరూ లేని చోట..ఆమె గుర్తించేలోగానే నా చేతిలోని యాసిడ్ సీసాతో దాడి చెయ్యడం..ఆమె అరుస్తూ కుప్పకూలిపోవడం..నేను పరారీ కావడం.

తర్వాత కోటీశ్వరుడైన నా తండ్రి ఆ సమయంలో నేను వేరే ఊళ్లో ఉన్నట్టు ఎలిబీ సృష్టించడం వల్ల నా మీదకి అనుమానం రాలేదు. చాలారోజులు కోర్టులో ఆ కేసు రకరకాలుగా నలిగిందని తెలిసింది. ఎందుకంటే ఆ తర్వాత నేను ఆ ఊరు వదిలేసి వేరే ఊళ్లో డాడీ బిజినెస్ అందుకున్నాను..తర్వాత మంగళతో నా పెళ్లి..సుధ, సూరజ్, పుట్టడం..ఇవన్నీ సినిమా రీళ్లలా తిరిగిపోయాయి. కాలం పాతికేళ్లని ఇట్టే మింగేసింది.

## ఏం రుచులండీ బాబూ!

అసలు తను సినిమా నటి కావాలని ఎప్పుడూ అనుకోలేదట. అనుకోకుండానే తారనయ్యాను అని చెప్పే మలయాళ భామ మీరాజాస్మిన్‌కి కాస్త జిహ్వా చాపల్యం ఎక్కువే. ఇటీవల ఆమె ఓ షూటింగ్ నిమిత్తం పాలకొల్లు వెళ్లిందిట. అక్కడ తిన్న రొయ్యల కూర రుచిని తను మరువలేనంటోంది. అసలిక్కడ ఆంధ్రాలో రుచులే వేరు. తెగ నోరూరిస్తాయి. వాటిని తినడానికే ఇక్కడ వుండిపోవాలనిపిస్తుంది మీరా జాస్మిన్.

నేను సూరజ్ విషయం ఏం చెయ్యాలా అనే ఆలోచనల్లో ఉండగానే..మర్నాడు నా ఆలోచనలను తారుమారు చేస్తూ పసుపు బట్టలతో వచ్చి ఆ జంట శ్రీలత, సూరజ్ నా కాళ్లకి దణ్ణం పెట్టి వెళ్లిపోతుంటే నేను చేష్టలుడిగిపోయాను.

★ ★ ★

ఎందుకీ ప్రపంచం ఇప్పుడు ఇంత శూన్యంగా..వెలితిగా..భరించలేనట్టుగా కనిపిస్తోంది?

సూరజ్ ఒక కులటను పంతంగా నా కోడలిని చేసి కుటుంబ గౌరవం మంటగలిపాడనా? కాదు..కాదు..అంతకు మించినదేదో..మమత విషయం వాడికెలా తెలుసు?

నేనింక నిలవలేకపోయాను. అంతవరకు ఎన్నడూ ఆశ్రమాల దారి నడవని నేను తొలిసారి ప్రశాంతతని వెతుక్కుంటూ..మా ఊరి చివరి ఆ ఆశ్రమం వైపు అడుగులు వేసాను.

ఆ వాతావరణం ఎంతో ప్రశాంతంగా

ఉంది. నాకు కొత్తగా ఉంది.

చాలాకాలం క్రితం నేనెంతో మనసుపడే పాట..కృష్ణశాస్త్రిగారి పాట గాలి అలలపై పయనిస్తూ వినవస్తోంది. అక్కడ వికసించిన పువ్వుల్లాంటి పిల్లల మృదు మధుర కంఠాల్లోంచి వస్తున్న ఆ పాట అచ్చం ఆనాటి మమత పాడుతున్నట్టే వుంది.

ఆశ్రమంలోకి అడుగు పెడుతుంటే నా మనసున అలుముకున్న అశాంతి మంచుతెరలా విడిపోతున్నట్టనిపించింది.

అక్కడ చెట్టుకింద ఎత్తయిన అరుగుమీద కూర్చుని ఎవరో స్వామీజీ జీవన రహస్యాన్ని వివరిస్తున్నారు.

'కర్మ మనం చేసే చర్య, ప్రతిచర్యల గొలుసులాంటిది. సంచిక కర్మ, ప్రారబ్ధ కర్మ, ఆగామి కర్మ..కొన్ని కర్మలు, వాటి ఫలాలు ఈ జన్మలోనే అనుభవానికి వస్తాయి. నేరస్థుడికి న్యాయస్థానం శిక్ష విధించిందీ అంటే ఈ జన్మలోనే అతడు కర్మఫలాన్ని పొందినట్టు...శిక్ష అతడికి సరైనది కాకపోతే, శిక్షపడేలోగానే అతడు మరణిస్తే కర్మఫలం వచ్చే జన్మకు బదిలీ అవుతుంది'

స్వామీజీ ప్రవచనాలు అక్కడ పిల్లలనూ పెద్దలనూ ఆలోచింపజేస్తున్నట్టు వాళ్ల ప్రశాంత వదనాల్లో వెల్లివిరుస్తున్న శాంతి సూచిస్తోంది.

కాని..స్వామీజీ మాటలు నన్ను కత్తులతో కోస్తున్నట్టున్నాయి. వేలెత్తి సూటిగా నన్నే చూపిస్తున్నట్టున్నాయి.

నా మనసు విలవిలలాడింది. నాకు మాత్రం ఈ అశాంతి ఎందుకు? వ్యాపారంలో మకుటం లేని చక్రవర్తిగా నిలిచిన నేను జీవితంలో గెలిచినట్టా ఓడినట్టా?

చేతులు జోడించి నిలబడిన నన్ను ఆ స్వామీజీ గుచ్చి గుచ్చి చూసారు..ఆయన కళ్లల్లో ఏదో గుర్తింపు.

"ప్రముఖ పారిశ్రామిక వేత్త పరమేశ్వర్‌గారు దారి తప్పి వచ్చినట్టున్నారు"

ఆ కంఠస్వరం నాకు పరిచితమైనదే..అతడు ఒకనాటి నా ప్రాణ స్నేహితుడు..రాజా..నాకు మతిపోయింది.

"అదేంటి..మీరు..నువ్విక్కడ? మమతా నువ్వూ పెళ్ళి చేసుకోలేదా?" స్వామీజీ నవ్వారు.

"మమత ప్రేమించింది నిన్నయితే నన్నెందుకు చేసుకోవాలి?" దూసుకు వచ్చింది బాణం.

"నీ స్వార్థపూరిత ప్రవర్తనతో మమత మనసుని నువ్వెంత ముక్కలు చేసావో నీకు తెలీదు ఈశ్వర్..మనిషిలోని ప్రేమంతా..అందమంతా మనకే దక్కాలి అనుకోవడం..మనకు దక్కనిది ఎవరికీ దక్కకూడదు..ఎంత భయంకరమైన భావన. వీటివల్ల ఎంతటి విపరీత పర్యవసానలు. నిజంగా ప్రేమించాలి పెళ్లిచేసుకోవాలి అన్న భావన కన్నా మమతను కంట్రోల్ చెయ్యాలన్న తపనే నీలో ఎక్కువ. ఈ భావనతో ఆమెకు గింజుకున్నట్టు ఉంటుందని నువ్వనుకోలేదు. ఏ బంధమైనా ఒకరంటే ఒకరికి నమ్మకం ఉన్నప్పుడే నిలబడుతుంది. ప్రేమించడం అంటే అవతలివారిని సొంతం చేసుకోవడం కాదు. సాన్నిహిత్యంలోను స్వేచ్ఛ ఉండాలి. నిజంగా ప్రేమించినప్పుడు అవతలివారిని పంజరంలో బంధించాలనుకోవడం. భాగస్వామి వ్యక్తిత్వాన్నీ స్వేచ్ఛనీ అగౌరవ పరచడం..చెయ్యం..నాదే అన్న భావన. నాకు మాత్రమే హక్కుభుక్తం అన్న ధోరణి మితిమీరి...ఇది ఎప్పుడు బావుంటుందో ఎప్పుడు ఊపిరాడక నలిపేస్తుందో ఏ మోతాదులో హాయినిస్తుందో..ఎక్కడ శ్రుతిమించి ప్రాణాలు తీస్తుందో..ఊహకందక మమత గిలగిలాడి పోయింది. సీతాకోక చిలుకను ఎరగకుండా పిడికిట్లో బంధించడం లాంటిదే నీ పొజిసివ్‌నెస్. నీకు పొజిసివ్‌నెస్‌కూ ప్రేమకూ తేడా తెలియదు. మమత మీద అధికారం చెలాయించాలన్న కోరిక ఆమెను నీ చెప్పుచేతల్లో ఉంచుకోవాలన్న ఉద్దేశ్యం స్వార్థం...ఆమెను బెంబేలెత్తించాయి..తరచు ఆమె నాతో పలువిధాలుగా వాపోయింది దీని గురించే...మమత ఆనాడు నిన్ను తిరస్కరించడానికి కారణం కూడా అదే' రాజా మాటలకు నేను నిర్ఘాంతపోయాను.

అవును ఆనాటి నా ప్రవర్తనకు..ఆమె నాకు కాకుండా పోతుందనే అభద్రతా భావమే కారణమని నాకు తెలియదు. ఆమె తల్లో మల్లెపూలు పెట్టుకుంటే నాకిష్టమైన గులాబీలు కాకుండా అవి పెట్టుకున్నావంటే 'నీకు ఆ అకౌంటెంట్ మూర్తిగాడంటే ఇష్టం అవునా?' అని నవ్వుతూనే సతాయించేవాడిని. ఆమె తనకిష్టమయిన తెల్లచీర కట్టుకుంటే..ఛ..ఈనాడు తలుచుకుంటేనే సిగ్గేస్తోంది. ఎంత అనాగరికమైన మాటలతో ఆమెను నొప్పించేవాడినో..ఆనాడు నాకెందుకు తెలియలేదు. ఆమెకు కావలసినవన్నీ నేను కొనిస్తున్నాననే చులకనభావమా? ఆమె తనదే..ఎక్కడికి పోతుంది అన్న స్వార్థమా?


"నీ భార్య మంగళ..చాలా కాలం క్రితం నీ డైరీల ద్వారా ఆమె గురించి తెలుసుకుని తన దగ్గరకు వస్తే ఏమన్నదో తెలుసా ఈశ్వర్?"

"పోనీండి అక్కయ్యా! ఈశ్వర్‌ని పెళ్లి చేసుకుంటే అతని బిడ్డలకే తల్లినయ్యేదానిని. కానీ ఇప్పుడు నాకెందరు పిల్లలో చూడండి. నాలాగ ఎవరి ఆదరణకీ నోచుకోని అనాథలెందరికో తల్లినవ్వాలనే భగవంతుడిలా చేసాడేమో అంది మమత తెలుసా?"

రాజా మాటలకి నా మనస్సు కలుక్కుమంది. మంగళ మమతను కలిసిందా? అందుకేనా అశాంతితో అలమటించిపోయింది.

## 'రేస్'తో ముందడుగు

ఇటీవల విజయం సాధించిన 'రేస్' సినిమా బిపాషా కెరీర్‌కి మంచి మేలు చేసింది. ఈ సినిమా పుణ్యమాని తన పారితోషికాన్ని పెంచేపారేసిందిట బిపాషా. అంతేకాదు, విదేశాల్లో స్టేజ్ షోలకి తీసుకునే పారితోషికాన్ని కూడా అమాంతం పెంచేసిందిట. రాబోయే ఆగస్టులో చేయడానికి ఒప్పుకున్న స్టేజ్‌షోలకి తను రాలేనని నిర్వాహకులకు చెప్పడంతో వాళ్లిప్పుడు తలపట్టుక్కూర్చున్నారట. రేటు పెంచితే రావడానికి ఆలోచిస్తానని బిపాషా అనడంతో ఇక లాభం లీగల్‌గా తేల్చుకుందామనుకుంటున్నారట నిర్వాహకులు. ఎందుకొచ్చిన గొడవ సామరస్యంగా తేల్చుకోండి అని సలహాలిస్తున్నారు సినీ పండితులు.



"ఈశ్వర్..కాలం మారింది. కానీ కొందరి యువత మనసులు మాత్రం మారలేదనిపిస్తోంది. ప్రేమకు ఆకర్షణకూ తేడా తెలియని స్థాయిలోని ఈనాటి యువత నీలాగ అదే లోకమనుకుంటోంది. కానీ తనకు దక్కని దానిని ఇతరులకు దక్కనివ్వ కూడదనుకోవడం పాశవికం తప్ప ప్రేమ ఎప్పటికీ అవదు. అలా అనుకోకపోవడం వల్లనే ఇలా అమ్మాయిలమీద అమానుషాలు జరుగుతున్నాయి.

సూరజ్ నాకంతా చెప్పాడు. పిల్లలైనా అంతే ఈశ్వర్..వాళ్లు మన నుంచి వచ్చినంత మాత్రాన మన సొంతం కాదు. ఈ విషయాన్ని నువ్వు అహం వదలి అంత చక్కగాను అర్థం చేసుకోగలిగితే నీకు బంధాలు ఊపిరాడనివ్వని బంధనాలుగా మారవు. హాయినిచ్చే నందనవనాలుగా మారతాయి. నాకొక్కటే ఆనందం ఈశ్వర్? సూరజ్‌కు నీ పోలిక రాలేదు. భగవంతుడు కరుణామయుడు"

"రాజా!" బావరుమంటూ సమాజంలో పేరు ప్రతిష్ఠ, అంతులేని సంపద ఉన్న కోటీశ్వరుణ్ణి..వాడి చేతిలో నిస్త్రాణగా వాలిపోయాను.

"మమతకు క్షమకు మారుపేరురా ఈశ్వర్..తన మీద నువ్వు చేసిన ఆ అఘాయిత్యం తెలిసీ నోరు మెదపలేదు. అంతే కాదు..'ఏది కోల్పోయినా దానిని మనం ఎదగడానికి ఒక మార్గంగా మలచుకోవడమే గొప్పతనం. యాంత్రిక జీవనంలో పడి మానవత్వాన్ని మరచిపోతున్న మనకు మానవత్వాన్ని గుర్తుకు తెచ్చుకోవడానికి దొరికిన సంబంధంగా భావించుకోవాలి' అనే సత్యాన్ని నమ్మిన మమత అనాథ చిన్నారుల సంక్షేమాన్ని తన ధ్యేయంగా చేసుకుంది"

"మమతను నేను చూడాలి రాజా..నన్నొక్కసారి ఆమె దగ్గరకు తీసికెళ్లు..ఆమె అంటే ఇప్పటికీ నాకిష్టమే" నా మాటలు నాకే కృతకంగా.

"మమత చాలా అదృష్టవంతురాలు. నీ క్షమాపత్ర మంతా విని అప్పటిలా గుండెల్లో బరువును కప్పిపుచ్చుకుంటూ నీ ఎదుట మళ్లీ చిరునవ్వు నవ్వాల్సిన శిక్షను భగవంతుడు ఆమెకు తప్పించాడు"

రాజా అక్కడ పారిజాత చెట్టుకింద చిత్రపటం కేసి చూపిస్తూ దానిముందు పిల్లలందించిన పువ్వుల నుంచి చేతులు జోడించాడు.

అప్పుడు చూసాను గులాబీ పూలమాలలతో అలంకృతమైన మమత చిత్రపటాన్ని ఆ చిత్రపటం ముందు మోకరిల్లుతున్న అసంఖ్యాకమైన ఆశ్రమ చిన్నారులను.

ఆ చిత్రపటంలో మమత ముఖం..యాసిడ్‌తో నేను దాడి చేసిన ఆ ముఖం..విక్రతంగా..భయంకరంగా..నన్ను భయపెడుతున్నట్టుగా..కానీ మమత అటువంటి రూపాన్ని చూసి కూడా ఆ చిన్నారుల ముఖంలో భక్తి పొంగి పొరలుతోంది.

దెబ్బతిన్న నా ప్రేమను ఈ లోకంపై ద్వేషంతో రూపాయలుగా..సంపాదనగా మార్చుకుని వ్యాపార ప్రపంచంలో తిరుగులేని రారాజునయ్యాను. కానీ మమత? దానినే నిస్సహాయులపై ప్రేమగా మార్చుకుని ఇక్కడివారి గుండెల్లో అమరజీవి అయింది.

ఓటమి నుండి ఏ ఆత్మహత్యో చేసుకుని పిరికిదానిలా జీవితం నుండి పారిపోలేదు ఆమె.

ఓటమి నుండే గెలుపునకు సోపానాలు నిర్మించుకుని ప్రేమతో ఆర్తజనుల హృదయ సింహాసనాలను అధిష్టించింది. జీవతాన్ని గెలిచాననుకున్న నేను ఎన్నో సోపానాలు క్రిందికి దిగిపోయి ప్రేమరాహిత్యంతో అధఃపాతాళంలో కూరుకుపోయాను. ప్రేమ పేరుతో ఆత్మవంచన చేసుకుంటున్న నేను, గారాబంగా పెంచిన నా కొడుకు దృష్టిలోనే కాదు..నన్ను కట్టుకున్న ఇల్లాలి మనసులో కూడా స్వార్థపరుడిగా మిగిలిపోయాను. నేను ప్రేమకే ద్రోహం చేసిన వాడిని. ప్రేమోన్మాదంతో అతివల ప్రాణాలు తీస్తున్న ఈతరం యువకులకేం తీసిపోయాను నేను?


నేరం చేసేది ప్రేమ కాదు అసలైన ప్రేమ కోరేది త్యాగం - ఇతరుల సుఖం ..స్వేచ్ఛతో బాటు ప్రేమకు బాధ్యత వుంది అని తెలుసుకుంటే ప్రేమకి ధోకా ఉండదు అనే సత్యం నాకెందుకు ఇంత ఆలస్యంగా తెలిసింది.

అక్కడ మరి నిలువ లేక నిరాశగా ఆశ్రమం నుండి వెనుదిరిగాను. శూన్యంగా మిగిలిన నాయింటి తలుపులు తెరచి లోపలి కెళ్లగానే..మమత మధుర కంఠాన్ని క్యాసెట్‌లో పొదిగి ఇంతకాలం నేను రహస్యంగా దాచుకున్న ఆ పాటను చివరిసారిగా వినేందుకు రికార్డర్ ఆన్ చేసాను.

"నీ యింటికి పిలువకు..నన్ను లోనికి రమ్మనకు" ఎంత ఆర్తి ఆ కంఠంలో? క్యాసెట్ బయటకు తీసి తగులబెట్టాను. ఇది నాకు నేను విధించుకున్న శిక్ష..ఏదో తెలియని అశాంతితో అలమటించే నాకు ఇన్నేళ్లుగా నిద్రమాత్రలా పనిచేసే ఆ పాట గురించే నాకే తెలుసు?

మమతకు మనస్ఫూర్తిగా తర్పణం విడిస్తున్నట్టుగా..చాలాకాలం తర్వాత నా కళ్లలో నిండుకున్న అశ్రువులు.

ఆ రాత్రి..ఎంతకీ మూతబడని నా రెప్పలకి...చిక్కని మేఘంలా గదిని ఆవరించుకున్న పొగ మసకగా కనిపిస్తోంది.



## ఒకే కథ-రెండు సినిమాలు

సుస్మితా సేన్ నిర్మిస్తూ నటిస్తున్న 'ఝాన్సీ రాణీ లక్ష్మీబాయ్' సినిమాకి ఇప్పుడు పోటీ సినిమా రూపొందబోతున్నట్టు బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. కేతన్ మెహతా దర్శకత్వం వహించే 'రాణీ ఆఫ్ ఝాన్సీ-లక్ష్మీబాయ్' అనే సినిమాలో టైటిల్ రోల్ పోషించేందుకు ఐశ్వర్యారాయ్ అంగీకరించిందిట. గతంలో 'మంగల్‌పాండే' సినిమా తీసిన కేతన్ డైరెక్షన్ పట్ల ఐశ్వర్యని ఇంటరెస్ట్ వుండడంతో ఈ సినిమా ఒప్పుకుందిట. కానీ సుస్మితాసేన్ 'ఝాన్సీరాణీ' సినిమా ఏమవుతుందో? రెండూ పూర్తయి రిలీజవుతాయో! వేచి చూద్దాం!